క్లుప్తంగా

12 మంది వలంటీర్లు రాజీనామా



రేపల్లె రూరల్: రేపల్లె పట్టణంలోని 24వ వార్డు సచివాలయం పరిధిలోని 22, 24వ వార్డుల్లో విధులు నిర్వర్తిస్తున్న 12మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేసి రాజీనామా పత్రాలను సచివాలయంలో అందజేశారు. అవ్వా తాతలకు నిస్వార్థంగా సేవలు చేసే తమపై రాజకీయ రంగు పులమరాదని కోరారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అవ్వా తాతలు ఇబ్బందులు పడకుండా ఎన్నికల కమిషన్ తన నిర్ణయాన్ని పునః పరిశీలించుకోవాలని కోరారు.

24 నుంచి గోగులమ్మ వార్షిక మహోత్సవాలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెద పులివర్రు గ్రామ దేవత శ్రీ గోగులమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాలు ఈ నెల 24వ తేదీన వైభవంగా ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం తెలిపారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి సహస్ర కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం గావిస్తారు. 25న భక్తులు నైవేద్యాలు, మొక్కుబడులు సమర్పించుకోనున్నారు. ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

ప్రజ్ఞాచారికి డాక్టరేట్



తెనాలిరూరల్: తెలుగు భాషకు సుదీర్ఘ కాలంగా తన వంతు సేవ చేస్తూ తనదైన ప్రత్యేకతను కనబరిచిన తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీ రత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి గౌరవ డాక్టరేట్ అందుకోనున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన తెలుగు సంస్కృతి సాహితీ సేవా సంస్థ చైర్మన్ ఏఎంజీ శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీన హైదరాబాద్ చిక్కడ్‌పల్లి త్యాగరాయ గాన సభ వేదికపై కవులకు గౌరవ డాక్టరేట్ ఇవ్వనున్నామని, దీనిలో భాగంగా అంతర్జాతీయ స్థాయిలో కవిగా గుర్తింపు తెచ్చుకున్న పూర్ణ ప్రజ్ఞాచారి సాహితీ సేవకు గుర్తింపుగా 2024 గౌరవ డాక్టరేట్‌కు ఆయనను తమ సంస్థ ఎంపిక చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణ ప్రజ్ఞాచారి విలేకర్లతో మాట్లాడుతూ తన తండ్రి నూతక్కి అబ్రహాం అక్షర వారసత్వాన్ని కొనసాగిస్తూ రచనలు చేస్తున్నానని, ఇన్నాళ్ల తన శ్రమకు ప్రతిఫలంగా ఈ గౌరవ డాక్టరేట్ రావడంపై హర్షం వెలిబుచ్చారు.

26లోగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

తెనాలిరూరల్: ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులు, సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్ కోసం 26వ తేదీ సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటరులో తమ ఎన్నికల విధుల ఆర్డర్ కాపీ, ఫారం-12, ఓటరు ఐడీ జిరాక్స్‌తో దరఖాస్తు అందజేయాలన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణం 15వ వార్డుకు చెందిన కె.హరికిషోర్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆయన మృత దేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేల నగదును అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.ప్రభాకర్, వెంకట్రావు, కొండలు, తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు విద్యుత్ వెలుగులు

- నియోజకవర్గానికి రూ.1.30 కోట్ల ఎంపీ ల్యాడ్స్ నిధులు కేటాయింపు
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు విద్యుత్ కాంతులు



పట్టణంలోని కర్లపాలెం రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

బాపట్ల: బాపట్ల నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా భావించి అభివృద్ధి చేయటంలో స్థానిక ప్రజా ప్రతినిధులు విజయవంతమయ్యారు. ఎంపీ నందిగం సురేష్ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేశారు. దీంతో బాపట్ల పట్టణంలో మౌలిక వసతుల సమస్యలు తీరినట్లయింది. ఎమ్మెల్యే కోన రఘుపతితో పాటు తనవంతుగా అభివృద్ధి పనుల్లో పాలు పంచుకోవటం సంతోషంగా ఉందని ఎంపీ నందిగం సురేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైట్ల ఏర్పాటుకు ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు కేటాయించారు.

బాపట్ల మున్సిపాలిటీకి రూ.50.10 లక్షలు, నరసాయపాలెంకు రూ.26.99లక్షలు, గోపాలపురానికి రూ.6.60లక్షలు, బోలాయపాలెంకు రూ. 23.57 లక్షలు, కర్లపాలెం మండలానికి రూ. 23.57 లక్షలు ఎంపీ ల్యాండ్స్ నిధులు మంజూరయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో రహదారులు విద్యుత్తు వెలుగులతో కాంతులీనుతున్నాయి.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్



బాపట్లలోని స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

బాపట్లటౌన్: స్ట్రాంగ్ రూముల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్ హెచ్చరించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను శనివారం ఆయన తనిఖీ చేశారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేసిన భవనాలను దాని పరిసర ప్రాంతాలను, రాకపోకలకు అవసరమయ్యే మార్గాలను రెవెన్యూ, పోలీస్ అధికారులు సమక్షంలో పరిశీలించడం జరిగిందన్నారు. రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు ఎన్నికల అనంతరం ఆరు నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎం బాక్స్‌లను ఏ విధంగా జాగ్రత్త చేయాలి.. స్ట్రాంగ్ రూముల చుట్టూ ఎటువంటి భద్రత చర్యలు తీసుకోవాలి.. బారికేడ్లు ఏ విధంగా ఎక్కడ ఏర్పాటు చేయాలి.. స్ట్రాంగ్ రూముల భద్రత కొరకు కేంద్ర సాయుధ బలగాలను, జిల్లా స్పెషల్ పార్టీ పోలీసులను ఎక్కడ నియమించాలి.. స్ట్రాంగ్ రూమ్ లోకి ఈవీఎం బాక్సులు తీసుకు వచ్చే బస్సులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఏవిధమైన చర్యలు తీసుకోవాలి.. అనే విషయాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణ, బాపట్ల రూరల్ సీఐ వై.శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేపల్లె రూరల్: కనీస జాగ్రత్తలు పాటించడంతో అగ్ని ప్రమాదాలకు దూరంగా ఉంచవచ్చని అగ్నిమాపకశాఖ అధికారి వై.సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైలు, బస్సు వంటి వాహనాలలో ప్రయాణించే సమయంలో పెట్రోలు, కిరోసిన్, గ్యాస్ వంటి వాటిని తీసుకెళ్లరాదన్నారు. ట్రాక్టర్‌లలో మితిమీరిన గడ్డివామును తీసుకెళ్లే సమయంలో పొరపాటున గడ్డి విద్యుత్ తీగలకు తగిలి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. ఇళ్లలో చిన్న చిన్న జాగ్రత్తలు పాటించటంతో ఎటువంటి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవని సూచించారు. అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో ప్రమాదాలను అదుపు చేసేందుకు ఉపయోగించే పరికరాల ఉపయోగాలను ప్రజలకు సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నాగేశ్వరరావు, ఎస్.నాగేంద్రరెడ్డి, జీ.కోటేశ్వరరావు, వి.సుబ్బారావు, ఎం.జనార్ధనరావు, కేవీ సాయికృష్ణారెడ్డి, పి.హరిబాబు, బీ.వీరకుమార్, సిహెచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ బాజీకి మాతృ వియోగం

చందోలు(కర్లపాలెం): వైఎస్సార్ సీపీ పిట్టలవానిపాలెం మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ షేక్ బాజీ మాతృమూర్తి షేక్ అక్తరున్నీసా(70) శనివా రం అనారోగ్యంతో మృతి చెందారు. అక్తరున్నీసా మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, కర్లపాలెం ఎంపీపీ యారం వనజ, పిట్టలవానిపాలెం ఇన్‌చార్జ్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, వైఎస్సార్ సీపీ పిట్టలవానిపాలెం మండల అధ్యక్షుడు వుయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్ డైరక్టర్ హుస్సేన్, సర్పంచ్ గౌరీదేవి విజయ్‌కుమారి, పార్టీ నాయకులు విజయరాజు, కరీమున్నీసా, మండే విజయ్‌కుమార్, బడుగు ప్రకాష్, మునీర్ తదితరులు ఉన్నారు.

నేడు 'గో టు హెల్' సాంఘిక నాటకం ప్రదర్శన



కరపత్రాన్ని ఆవిష్కరించిన డాక్టర్ సాయిమాధవ్ బుర్రా

తెనాలి: కళల కాణాచి-తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్-విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో 'గో టు హెల్' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించనున్నారు. రసఝురి-పొన్నూరు సమాజంచే ప్రదర్శించే ఈ నాటకాన్ని స్వర్గీయ గొల్లపూడి మారుతీరావు రచించారు. రంగస్థల/సినీ నటుడు వై.ఎస్.కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహిస్తారు. కార్యక్రమ కరపత్రాన్ని శనివారం గాంధీనగర్‌లో ప్రముఖ సినీ మాటల రచయిత, కళల కాణాచి అధ్యక్షుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. నాటక ప్రదర్శనకు ముందు ఆరు గంటలకు కళల కాణాచి ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన జరిగే సభలో పట్టణానికి చెందిన వైద్య ప్రముఖుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తికి 'ప్రైడ్ ఆఫ్ తెనాలి' పురస్కారం ప్రదానం చేస్తారు. అజో-విభో-కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణ పురస్కార ప్రదాతగా వివరించారు. చెరుకుమల్లి సింగారావు, ఎం.రామలింగేశ్వరుడు, కొండముది రమేష్, బడుగు మోహనరావు, దేవరపల్లి భవాని పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసు దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి మండలం నేలపాడు పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు తమ సిబ్బందితో శుక్రవారం రాత్రి పొద్దుపోయాక ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.60,500 నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనపర్చుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శేషుకుమారి

కర్లపాలెం: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆట పాటలతో కూడిన విద్యనందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషుకుమారి తెలిపారు. మండలంలోని చింతాయపాలెం పంచాయతీ ఎస్టీ కాలనీలోని ఎస్‌వీ పద్మావతి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకున్న చిన్నారులు ప్రాథమిక పాఠశాలలో చేరేందుకు గానూ సర్టిఫికెట్లు అందజేశారు. సరైన పౌష్టికాహారం అందించటం వలన చిన్నారులలో శారీరక, మానసిక పెరుగుదల సక్రమంగా ఉంటుందని శేషుకుమారి చెప్పారు. ఆట పాటల ద్వారా విద్యనందించటం వలన చదువుపై ఆసక్తి పెరగటంతో పాటు చెప్పినవి గుర్తుంచుకోగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

చందోలు(కర్లపాలెం): ప్రీ స్కూల్ చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పటమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలలో పట్టభద్రుల దినోత్సవం నిర్వహిస్తున్నామని బాపట్ల సీడీపీవో బి.శైలజ తెలిపారు. శనివారం చందోలు అంగన్‌వాడీ కేంద్రంలో పట్టభద్రుల దినోత్సవం నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు సీడీపీవో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పంపటం వలన చిన్నారులు పాఠశాలలకు వెళ్లేందుకు అలవాటు పడతారని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి చిన్నారిపై శ్రద్ధ చూపి పౌష్టికాహారం అందించటంతో పాటు ఆటపాటలతో చదవటం, రాయటం నేర్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ కుమారి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాజాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

బాపట్ల అసెంబ్లీ స్థానానికి మూడు నామినేషన్లు

బాపట్ల: బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గానికి శనివారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్వో కేంద్రంలో జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌కు వీరు నామినేషన్లు అందించారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఉప్పాల మురళి, కే.విజయరాజు, తెలుగుదేశం పార్టీ తరఫున వేగేశన హరికుమారి రెండు సెట్లు నామినేషన్లు వేశారు. పార్లమెంటు నియోజకవర్గానికి ఒక్క నామినేషన్ కూడా వేయలేదు.

అసెంబ్లీ స్థానానికి ఒక్క నామినేషన్

రేపల్లె రూరల్: రేపల్లె అసెంబ్లీ స్థానానికి ఒక నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ అనంతరం శనివారం ఆమె మాట్లాడారు. బహుజన సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అభ్యర్థి డొక్కా శ్రీనివాస్‌బాబు నామినేషన్ దాఖలు చేశారన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్‌లు దాఖలు చేసుకునేందుకు సమయం ఉందన్నారు. ప్రభుత్వ సెలవు దినాలలో నామినేషన్‌ల స్వీకరణ ఉండదన్నారు.

డాక్టర్ మోహన్‌దాస్‌కు ఘన నివాళి



డాక్టర్ హరితకు బంగారు పతకాన్ని ప్రదానం చేస్తున్న వైద్యులు

తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొడాలి మోహన్‌దాస్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొని డాక్టర్ మోహన్‌దాస్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో విజయవాడకు చెందిన ప్రశాంత్ హాస్పటల్ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ పి.హరిత స్త్రీల గర్భకోశ వ్యాధులపై డాక్టర్ కొడాలి మోహన్‌దాస్ సంస్మరణ సభలో స్మారకోపన్యాసం చేశారు. డాక్టర్ హరితకు ఐఎంఏ సభ్యులు డాక్టర్ మోహన్‌దాస్ గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ కె.పావని ప్రియాంక, డాక్టర్ మాదల ప్రభాకర్‌బాబు, డాక్టర్ పి.దక్షిణామూర్తి, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ అబ్బయ్య, డాక్టర్ జాస్తి భానుప్రసాద్, డాక్టర్ నరసింహారావు తదితర వైద్యులు పాల్గొన్నారు.

యువత గ్రంథాలయాల బాట పట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న కార్యదర్శి సుబ్బరత్తమ్మ

పొన్నూరు : ఇంటర్నెట్ విస్తృతి నేపథ్యంలో యువత చరవాణులకే పరిమితం కాకుండా విజ్ఞానం పెంపొందించుకునేందుకు గ్రంథాలయాల బాట పట్టాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సుబరత్తమ్మ అభిప్రాయం వ్యక్తం చేశారు. పాత పొన్నూరులోని గ్రంథాలయాన్ని ఆమె శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పాఠకులను ఉద్దేశించి సుబ్బరత్తమ్మ మాట్లాడారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచేందుకు ప్రభుత్వం గ్రంథాలయాలను భివృద్ధి చేస్తుందన్నారు. యువత విధిగా వార్తా పత్రికలు, పుస్తకాలను చదవడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఆమె వెంట పొన్నూరు గ్రంథాలయ అధికారి కృష్ణ మోహన్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణపై బీజేపీకీ చిత్తశుద్ధి లేదు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ



ప్రత్తిపాడు: మాదిగల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ఏమీ చేయలేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ పల్లెపోగు పాపారావు మాదిగ అధ్యక్షతన శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. గత పదేళ్లుగా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. మాదిగల్ని ఓటు బ్యాంకుగా వాడుకోవడం తప్ప వారి సంక్షేమానికి చేసిందేమీ లేదన్నారు. క్రైస్తవులపై దాడులు కూడా పెరిగాయని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు.